ఊరూరా చవితి సందడి



రాయదుర్గం: ముస్తాబవుతున్న హిందూ మహా గణపతి మంటపం



ఉరవకొండలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం



రాయదుర్గంలో విక్రయానికి ఉంచిన చిన్న బొజ్జ గణపయ్యలు

- నేడు కొలువుదీరనున్న గణపతి ప్రతిమలు
- విగ్రహాలు, సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్లు

రాయదుర్గం/రాయదుర్గం టౌన్/ ఉరవకొండ/ కూడేరు / : రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో చవితి సందడి ప్రారంభమైంది. జైజై గణేశా అంటూ .. మంటపాల్లో గణపతులను కొలువుదీర్చేందుకు నిర్వాహకులు విగ్రహాలను శుక్రవారం తరలించారు.దీంతో పండుగ వాతావరణం నెలకొంది. ఇంట్లో పూజల కోసం బొజ్జగణపయ్యల విగ్రహాలను రాయదుర్గంలోని పలు ప్రాంతాల్లో విక్రయదారులు సిద్ధంగా ఉంచడంతో కొనుగోలు దారులతో రద్దీ నెలకొంది. రాయదుర్గంలోని వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ ఏరియాల్లో జనం పండుగ సామగ్రి కొనుగోలుతో కిటకిటలాడింది. రాయదుర్గం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 60 చోట్ల పంటపాలు ఏర్పాటుకు అనుమతి పొందినట్లు పోలీసులు తెలిపారు. గణనాథుడి తొలిపూజకు మంటపాలు ముస్తాబయ్యాయి. పూజాసామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కోలాహలంగా మారాయి. గణేశుడి నవరాత్రులు పురస్కరించుకుని ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తె లియజేశారు.

చవితి సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన క్లాక్‌టవర్ ..

ఉరవకొండలోని క్లాక్‌టవర్ ప్రాంతం ప్రజలతో కిక్కిరిసింది. పండుగ సామగ్రికి కావాల్సిన పూలు, మామిడి ఆకులు, అరటి ఆకులు, చెరకు, పండ్లు, పత్రి తదితర వస్తువులతో ఇంట్లో కొలువుదీర్చడానికి చిన్న వినాయక విగ్రహాలను కొనుగోలు చేశారు. ఉరవకొండలో దాదాపు 30 వినాయక మంటపాలను ఏర్పాటు చేశారు. కూడేరు మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలకు ప్రజలు శుక్రవారం సన్నద్ధమయ్యారు. వాడవాడలా విగ్రహాల ఏర్పాటుకు మంటపాలు సిద్ధం చేశారు. మండల, జిల్లా కేంద్రాలైన కూడేరు, అనంతపురంలో అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకున్న వినాయక విగ్రహాలను ట్రాక్టర్ బొలేరో, హైచర్ వాహనాల్లో మంటపాల వద్దకు తరలించారు.

కొలువుదీరనున్న హిందూ మహాగణపతి విగ్రహం

రాయదుర్గం పట్టణంలో హిందూ మహాగణపతి విగ్రహం కొలువు దీరనుంది. కర్ణాటకలోని చిత్రదుర్గం, దావణగెర, హుబ్లి, శివమొగ్గ ప్రాంతాల తరహాలో మహాగణపతి ఉత్సవాలను 11 రోజుల పాటు నిర్వహించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, మల్లికార్జున తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితికి ప్రత్యేక మందిరాలను ముస్తాబు చేశారు. శనివారం చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు కొలువుదీర్చనున్నారు. వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శివ హెచ్చరించారు. స్థానిక సన్‌రైజస్ పాఠశాలలో ఎంపీడీఓ రామచంద్ర, కరస్పాండెంట్ మారెన్న, విశ్రాంత ఉపాధ్యాయుడు నాగరాజు మట్టి గణనాథులను పంపిణీ చేశారు.

అపురూపం..దశభుజ గణపతి ఆలయం

రాయదుర్గంలోని దశభుజ గణపతి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. రాయదుర్గం కొండపైకి వెళ్లే దారిలో పట్టణంలోని ఆత్మకూరు వీధిలో దశభుజ గణపతి ఆలయం ఉంది. ఇక్కడ ఏకశిలపై దాదాపు 15 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పుతో దశభుజాలతో వినాయకుడిని మలిచారు. గణపతి ప్రతిమకు మొత్తం పది చేతులుంటాయి. ఎడమ వైపున 5 చేతులు, కుడి వైపున 5 చేతులతో ఒక్కో చేతిలో ఒక్కో ఆయుధంతో ఆ రూపం భక్తులను తన్మయుల్ని చేస్తుంది. కుడి వైపు మొదటి చేతిలో నారికేళం, రెండో చేతిలో చక్రం, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో ధనుస్సు, ఐదే చతిలో అంకుశం ఉంటాయి. ఎడవైపున మొదటి చేతిలో భార్య సిద్ధి, రెండో చేతిలో శంఖం, మూడో చేతిలో పవిత్రం, నాలుగో చేతిలో శరం, ఐదో చేతిలో ఖడ్గంతో దర్శనమిస్తోంది. దీనికి సిద్ధ వినాయకుడి ఆలయమని మరో పేరు కూడా ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి



వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయి. అనంతరం ప్రాంతాలను బట్టి 3, 5, 9, 11 రోజులకు నిమజ్జనం చేస్తారు. గణేశ్ మంటపాలను ఇరుకైన వీధుల్లో ఏర్పాటు చేయరాదు. మంటపాల వద్ద చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదు. 24 గంటలు పర్యవేక్షణ ఉండాలి. గాలీ వానకు మంటపాలు కూలిపోకుండా పకడ్బందీగా నిర్వహించాలి. భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు, సీసీటీవీలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. రాత్రివేళ మంటపంలోకి పశువులు, కుక్కలు చొరబడకుండా అడ్డంగా కంచె ఏర్పాటు చేయాలి. అనుమతుల్లేకుండా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. డీజేలకు అనుమతిచ్చేది లేదు.

– వెంకటరమణ, సీఐ, రాయదుర్గం

మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చవితి శుభాకాంక్షల



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ



మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, అధికారులు, అనధికారులకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు శుక్రవారం తెలియజేశారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

రాయదుర్గం: వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలగిపోయి, సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. గణనాథుడి కరుణాకటాక్షాలతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. బొజ్జగణపయ్యను వాడవాడలో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. మట్టితో కూడిన ప్రతిమలనే ప్రతి మంటపం, ఇంట్లో పూజిస్తూ పండుగ సంప్రదాయాన్ని పరిరక్షించే బాధ్యత ప్రజలందరు తీసుకోవాలని మెట్టు పిలుపునిచ్చారు.

విఘ్నాలు తొలగిపోవాలి

రాయదుర్గంటౌన్: వినాయక చవితి సందర్భంగా రాయ దుర్గం పట్టణ ప్రజలందరికీ మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలు తొలగి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అందరి జీవితాల్లో వినాయకుడు వెలుగులు నింపాలని కోరారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లకు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: మట్టి వినాయకులను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు తెలిపారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న జైకిసాన్ ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలు ప్రజలకు అందించారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో వినాయక పండుగను పురస్కరించుకుని పర్యావరణాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీధర్, సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్,టీపీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



రవీంద్రయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్



సుబ్బరాయుడు, మెప్మా టీపీఆర్‌ఓ

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘ కార్యాలయంలో నూతనంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా రవీంద్ర యాదవ్, మెప్మా విభాగం టీపీఆర్‌ఓగా సుబ్బరాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా ముమ్మడి వరం మున్సిపాలిటీ నుంచి రవీంద్ర యాదవ్ బదిలీపై ఇక్కడికి రాగా, ధర్మవరం మున్సిపాలిటీలో పని చేస్తున్న సుబ్బరాయుడు ఇక్కడికి మెప్మా టీపీఆర్‌వోగా బదిలీపై వచ్చి, బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి జాయినింగ్ ఆర్డర్ అందించారు. అనంతరం చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పను కలిసి మాట్లాడారు.

గేదెకు సిజేరియన్



గేదె ప్రాణాలను కాపాడిన పశువైద్య బృందం

అనంతపురం అగ్రికల్చర్: ప్రాణాపాయంలో ఉన్న గేదెకు సిజేరియన్ చేసి రక్షించారు పశువైద్య బృందం. కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామంలో తిప్పేస్వామికి చెందిన గేదె ఈనలేక మూడు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతోంది. స్థానిక పశుశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసగుప్తాను రైతులు సంప్రదించారు. గేదెను పరీక్షించిన ఏడీ లోపల దూడ అడ్డం తిరగడంతో ఈనలేక పోతోందని, శస్త్రచికిత్స చేయాలని శింగనమల పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభంకు సిఫారసు చేశారు. గురువారం రాత్రి 1962 వాహనంలో గేదెను అనంతపురం పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షించారు. పశువైద్యులు పద్మనాభం, కిరణ్‌కుమార్ రెడ్డి, సునీత, సురేంద్ర, హెల్పర్స్ ప్రవీణ్, శివ, రాజశేఖర్, జమ్మన్న, కమలాకర్, గీత తదితరులు గంట పాటు శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్సతో చనిపోయిన దూడను బయటకు తీసి గేదె ప్రాణాలను కాపాడిన వైద్య బృందానికి రైతు తిప్పేస్వామి ధన్యవాదాలు తెలిపారు.

మహిళా రైతు ఉత్పత్తిదారుల మండల సమాఖ్య ఏర్పాటు

కణేకల్లు: మహిళా రైతు ఉత్పత్తిదారుల మండల సమాఖ్య ఏకగ్రీవంగా ఏర్పాటైంది. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 92 గ్రామ కమిటీలు సమావేశమై మండల సమైక్యను ఏకగ్రీవంగా ఎనుకొన్నట్లు రాయదుర్గం వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు. మండల సమైక్యను చిక్కణ్ణేశ్వర మహిళా రైతు ఉత్పత్తిదారుల సమైక్య లిమిటెడ్‌గా పేరు పెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘం అధ్యక్షురాలిగా బి.హనుమక్క, ఉపాధ్యక్షురాలిగా పి.హేమలత, కార్యదర్శిగా వెంకటలక్ష్మీ, కోశాధికారిగా జ్యోతిలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఏపీఎం గోవిందప్ప, సీసీలు గోవిందు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



చాబాలలో హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం



అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను సన్మానిస్తున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు

వజ్రకరూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందని చాబాల సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. శుక్రవారం చాబాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పూసల నరేష్,వైస్ చైర్మన్ కవిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ సాకే రామాంజనేయులు, పాఠశాల కోఆప్షన్ సభ్యుడు లాలుసాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, లేపాక్షి పాల్గొన్నారు. అలాగే స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎం స్వర్ణలతను సర్పంచు మోనాలిసా, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు సన్మానించారు. ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్ నరేష్, ఆదర్శ పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ హిదాయ్‌తుల్లా తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో ‘దుర్గం’ విద్యార్థుల ప్రతిభ



సైన్స్‌ఫేర్‌లో బహుమతులు పొందిన విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: శ్రీసరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో పట్టణానికి చెందిన సరస్వతీ విద్యామందిర్ కళాశాల విద్యార్థులు బహుమతులు పొందారు. గణిత నమూనాల అంశంలో కీర్తన ప్రియ, స్వచ్ఛభారత్ అభియాన్ అంశంలో లిఖిత, సంస్కృతి జ్ఞాన క్విజ్‌లో అఖిల్ శ్రీనివాస్, నిహస్, తనూజ్ కుమార్, ద్వితీయ స్థానం సాధించారు. సైన్స్ క్విజ్‌లో దుర్గా ప్రసాద్, రక్షిత్, యస్విత, ప్రథమ స్థానం సాధించారు. మొత్తం 25 మంది విద్యార్థులు పాల్గొనగా, 8 మందికి బహుమతులు అందాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల14, 15 జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

రాయదుర్గంటౌన్: గుంతకల్లు పట్టణంలో సరస్వతీ శిశు మందిరంలో జిల్లా స్థాయిలో శనివారం జరిగిన సైన్స్‌ఫేర్‌లో రాయదుర్గం శిశుమందిరం విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున, హెచ్‌ఎం రాజేశ్వరి తెలిపారు. న్యూ ఇన్నోవేషన్‌లో 5వ తరగతి విద్యార్థి ప్రణీత్ మొదటి బహుమతి, సింపుల్ మిషన్‌లో పద్మావతి, వాటర్ కన్వెన్షన్‌లో శ్రీజస్యలు మొదటి బహుమతి సాధించారు. గ్రాండ్ కాంపిటేటర్ విభాగంలో అశ్రిత తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

విడపనకల్లు: మండలంలోని ఎస్.తిమ్మాపురానికి చెందిన వీఆర్‌ఏ ఆంజనేయులు (58) అనారోగ్యం శుక్రవారం మృతి చెందాడు. రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏ మృతిపై సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వన్నప్ప, వీఆర్వో నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె



రాయదుర్గంలో సమ్మె చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు



కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: నీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి హాజరై మద్దతు తెలిపారు. నియోజకవర్గంలోని ఆలూరు, టి.వీరాపురం, రాయదుర్గంలోని మూడు పంప్ హౌస్‌ల కింద పనిచేస్తున్న 68 మంది కార్మికులు విధులన బహిష్కరించి, సమ్మెలో పాల్గొన్నారు. యూనియన్ నాయకులు అశోక్, అంజి, మంజు, రాజశేఖర్ మాట్లాడారు.

కళ్యాణదుర్గం రూరల్: సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి ఫ మ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి కార్మికులు పాల్గొన్నారు.

కూడేరు: న్యాయపరమైన తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ విధుల్లోకి చేరమని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ కార్మికులు తెగేసి చెప్పారు. శుక్రవారం కార్మికులు కూడేరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు. కార్మికులు మాట్లాడారు. 8 నెలలుగా జీతాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రాజెక్టుల కార్మికులు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, గోవింద్, రామకృష్ణ, నాగరాజు, శీన, లక్ష్మీనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

చాదర్ సమర్పణ



చాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శుక్రవారం పూల చాదర్ సమర్పించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా అమ్మవారి చాదర్‌ను దర్గాకు భారీ ఊరేగింపు నడుమ ఎమ్మెల్సీ తీసుకొచ్చారు. దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని సన్మా నించారు. నాయకులు మస్తాన్, శిలార్ మగ్బూ ల్, నబి, ఆకుకూర నాగరాజు, విజయ్, చిన్నము ష్టూరు ఎర్రిస్వామి, ఉప్పర ధనంజయ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కంబదూరు: కదిరిదేవరపల్లికి చెందిన ధనశేఖర్‌రెడ్డి అనే రైతు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి, అల్యూమినియం తీగలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. బాధిత రైతు కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: మండలంలోని బూదగవి గ్రామంలో మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సహాయ కార్యదర్శి చన్నరాయుడు మాట్లాడుతూ బూదగవిలో పనులు చేయకపోయినా చేసినట్లు బినామీ కూలీలను సృష్టించి, రూ.లక్షలు అవినీతికి పాల్పడ్డారన్నారు.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి

కణేకల్లు: వారానికోసారి ప్రతి ఒక్కరూ తప్పక డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో డ్రై డేపై మలేరియా సబ్ యూనిట్ అధికారితోపాటు పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ తిరుపాల్‌నాయక్, ఏఎన్‌ఎంలు వన్నూరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

కళ్యాణదుర్గం రూరల్: వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్డీఓ రాణీసుస్మిత, డీఎస్పీ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, సీఐ వెంకటరమణ తెలిపారు. వినాయక మంటపాలల్లో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. ముదిగల్లు రోడ్డు పక్కనున్న పాల్వాయి కుంటలో నిమజ్జనం చేయాలన్నారు. 9న మధ్యాహ్నం వినాయక ఊరేగింపు ప్రారంభించి, రాత్రి 8 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఆముదం పంటకు ఆశించిన దాసరి పురుగు

కళ్యాణదుర్గం: ఆముదం పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగులు నివారించవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు చెప్పారు. శుక్రవారం కుందుర్పి మండలంలోని తెనగల్లులో రైతులు సాగు చేసిన ఆముదం పంటలను కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు, శాస్త్రవేత్త డాక్టర్ శిరీష, వ్యవసాయ అధికారి మహేష్ పరిశీలించారు. సెప్టెంబర్ నెలలో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. లద్దె పురుగు తొలి దశలో ఆకులను గీకి, తర్వాత దశలో రంధ్రాలు చేస్తుందన్నారు. ఈ పురుగు తొలి దశలో ఉన్నప్పుడు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. పురుగు నివారణకు బీటీ 400 గ్రాములు ఎకరాకు లేదా వేపనూనె ఒక లీటరు ఎకరానికి, అలాగే పెద్ద పురుగులు ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజోమేట్ 100 గ్రాములు లేదా నోవల్యూరాన్ 200 మి.లీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగులు రాకుండా లీటరు నీటికి 1 గ్రాము కార్బెండజిమ్ లేదా ప్రియాక్సిల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి మొక్క అన్ని భాగాలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గాక నేలలో తేమ ఉన్నప్పుడు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ పై పాటుగా వేస్తే తెగులు నష్టాన్ని నివారించవచ్చన్నారు.

సంక్షిప్త సమాచారం

అనుమతులు తప్పనిసరి

కంబదూరు: వినాయక చవతి వేడుకలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు, చవితి వేడుకల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఏఎస్‌ఐ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రఘు బాబు శుక్రవారం తెలిపారు.

‘విశ్వకర్మ యోజన’పై అవగాహన కల్పించాలి

కుందుర్పి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న విశ్వకర్మయోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. శుక్రవారం కుందుర్పి గ్రామ సచివాలయంలో విశ్వకర్మ పథకం విధివిధానాలపై సిబ్బంది, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

రేపు ఎమ్మార్పీఎస్ నాయకులకు సన్మానం

వజ్రకరూరు: జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు , సీనియర్ నాయకుడు బెంజిమెన్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలన్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంటౌన్: గుమ్మఘట్ట మండలంలో ఒక మహిళ, బ్రహ్మసముద్రం మండలంలో ఓ యువతి పురుగుల మందు సేవించి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. గుమ్మఘట్ట మండలం వైద్యం గుండ్లపల్లికి చెందిన రంగమ్మ (50) ఇంట్లో విషపుగుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన మేఘన (16) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జీవితం నాశనం చేసుకోవద్దు

కూడేరు: క్షణిక సుఖం కోసం చెడు మార్గాన వెళ్లి జీవితం నాశనం చేసుకోవద్దని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం లింక్ వర్కర్ రాజేశ్వరి యువతకు సూచించారు. శుక్రవారం కొర్రకోడులో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో యువతకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రైడేపై ర్యాలీ

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పీహెచ్‌సీ పరిధిలోని బీసీ కాలనీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్‌నాయక్, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్‌ఎం శ్రావణి, అనిత పాల్గొన్నారు.

చిరుతదాడిలో దూడమృతి

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి పరిసర ప్రాంతంలో ఆవుదూడపై చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన పాడి రైతు దాదాపీరా గ్రామ చివరన ఒక చిన్నపాటి కొట్టంలో నాలుగు ఆవులను పోషిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి కొట్టంలోని దూడపై చిరుత దాడిచేసి సుదూర ప్రాంతానికి లాక్కెళ్లింది. దాడిలో దూడ మృతిచెందింది. ఫారెస్ట్ అధికారులకు విషయం తెలియజేయగా, వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఫారెస్ట్ అధికారిణి తిమ్మక్క, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు మృతి

బొమ్మనహాళ్: రెండురోజుల క్రితం అదృశ్యమైన దర్గాహొన్నూరుకు చెందిన రాజప్ప (30) గ్రామశివారులోని పొలంలో శవమై కనిపించాడు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. తన అన్న రాజప్ప భార్య లక్ష్మీ ప్రవర్తన సరిగాలేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని రాము సోదరుడు చంద్రహాస్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కడదరకుంట గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌ల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి పోషకాలు ఉన్న ఆహారంపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధా, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

విడపనకల్లు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 1,6 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలపై గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్‌ఎం శ్రావణి,ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుందుర్పి: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే పౌష్టికాహార మాసోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ వనజా అక్కమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మిదేవి సూచించారు. శుక్రవారం కుందుర్పిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.